

# సుగుణ

గుడిపాటి వెంకటేశ్వరరావు

'మాష్టారూ...ఏమిటేది !'

తోటి ఉపాధ్యాయులు ఆనందంగారి పిలుపుతో ఈ లోకంలో పడ్డాను. అప్పుడు గాని తెలియలేదు—నేను క్లాసులో పిల్లల ముందు కూర్చొని ఏడుస్తున్నట్లు. ఒక రెక్క పూడిన చెక్కకుర్చీమీదనుంచి ఉత్తరీయాన్ని తీసుకొని కళ్ళద్దుకొని లేచి నిలబడ్డాను. ఏభైమంది ఒకటో క్లాసు పసివాళ్లు నావైపే చూస్తున్నారు. మాష్టారు ఏడవటమంటే బహుశా వాళ్లకు చాలా విచిత్రంగా కన్పించొచ్చు. మాష్టారు ఏడిపించటమేగాని ఏడవరని వాళ్లభిప్రాయం !

నా క్లాసుకూడా ఆనందంగారి కప్పగించి స్కూలునుంచి బయలుదేరాను. దుఃఖంతో గొంతింకా పూడుకు పోతోంది. ఏదో పెన్నిధిని పోగొట్టుకున్నంత బాధ. ఎవరో ఆత్మీయుల్ని దూరంగా విసిరేసినంత పశ్చాత్తాపం ! ఏదో సున్నిత హృదయాన్ని వ్రక్కలు చేసిన భయంకర భావన ! హృదయంలోని ఆవేదన కుబుసం విడిచిన త్రాచులా వుండుండి బుసకొడుతోంది.

సాయంత్రం మూడయింది. ఇప్పుడిప్పుడే వేసవి ఎండలు ముదురుతున్నాయి. వీధ

మ్మేలు నడుస్తున్నాను. భారంగా పడు తున్నాయి అడుగులు. త్వరగా నడవాలి. బస్సుకు టైమ్ కూడా లేదు.

నేను అద్దెకుంటున్న పెంకుటింటి తాళంతీశాను. జతగుడ్డలు చేతిసంచిలో కుక్కాను. పెట్టెలో మిగిలిన డబ్బుతీసి పర్సులో పెట్టుకున్నాను. గదికి తాళంవేసి బయటికి నడిచాను. సమయానికి నా భార్య కూడాలేదు. వాళ్ళమ్మకు వంట్లో బాగుండ లేదని చూసేందుకు వెళ్ళింది.

ప్రక్కవాటాలో వుంటున్న ఇంటి యజ మాని కొడుకు రాము ఎదురయ్యాడు.

'చూడు రామూ ... నేను వూరెళు తున్నాను. రెండురోజులు పట్టొచ్చు. కాస్త మా యింటివేపుకూడా చూస్తూవుండండి...' అన్నాను.

'అలాగే మాష్టారూ...' అన్నాడు రాము.

నాలుగ్గంటల బస్సు అందుకోవాలని గబగబా నడిచాను. రేపుదయానికిగాని గమ్యం చేరలేను. మధ్యలో మరోచోట బస్సు మారాలి. ఆమె ఎలావుందో! చివరి చూపైనా లభిస్తుందో లేదో!

ఊరు బయట కంకర రోడ్డుమీదికి చేరుకున్నాను. ఒకబడ్డీకొట్టు ప్రక్కన బండిమీద చతికిలపడ్డాను. సోడా కొట్టిం చుకు త్రాగి దూరంగా రోడ్డుమీదికి పార జూశాను. దట్టంగా రేగిన దుమ్ము ముసుగులో పరుగెడుతున్న బస్సు కన్పిం చింది. సరిగ్గా సమయానికి కొచ్చానన్న మాట!

బస్సువచ్చి ఆగింది. మరేమంత రద్దీగా లేదు. ఎక్కికూర్చున్నాను. వేడికి శరీరం కుతకుత ఉడుకుతోంది. దానికితోడు ముందుసీటాయన చుట్టపొగను పొగ బండిలా గుప్పుగుప్పున వదుల్తున్నాడు. నాకు ఊపిరాడటంలేదు.

బస్సు కదలటంతో కాస్త ప్రాణం కుదుటపడింది. మనస్సు మళ్ళా ఆమె మీదికి పోయింది...

పదేళ్ళనాడు పరిచయమైంది సుగుణ. ఆమె పనిచేస్తున్న స్కూలుకు క్రొత్తగా బదిలీఅయ్యింది నాకు. ప్రధానోపాధ్యాయులు కాక మేమిరువురమే ఉపాధ్యాయులం. ఆ మారుమూల గ్రామంలో నాకు ఆసరా అయింది సుగుణ.

ఆపూటకు భోజనమెలాగా అన్నది పెద్ద సమస్య అయింది నాకు. పిల్లల్ని విచా రిస్తే డబ్బులుతీసుకు భోజనం పెట్టే వారెవరూలేరని తెలిసింది. చిన్నహోటలు లాంటిదేమీ లేదు. కాఫీకూడా దొరకదు! పిల్లలకు పాఠం చెప్పటంమాని ఆ విష యమే ఆలోచిస్తున్నాను! మరీ ఇలాంటి వూళ్ళో పనిచేయవలసి వస్తుందనుకోలేదు!

బడిగంట గణగణ మ్రోగింది. పిల్లలు బిలబిలాబయట కురుకుతున్నారు. నేనలాగే చూస్తూ కూర్చుండిపోయాను. కడుపులో ఆకలి మంటుతోంది. ఆకలితీరే మార్గం లేదని తెలియబట్టేమో మరికాస్త విజృంభి స్తోంది ఆకలి!

చూస్తుండగానే స్కూలు ఖాళీ అయి పోయింది. బల్లలు తెల్లబోయి చూస్తు న్నాయి. హెడ్‌మాష్టరు పిలిచి స్కూలు తాళమిచ్చాడు. నా మకాము స్కూల్లోనేనని తెలుసుకుని. అలాగే కుర్చీలో కూలబడి జరగవలసినదాన్ని గురించి ఆలోచిస్తున్నాను. పోనీ ఈ పూటకు ఎలాగో ఓపికపట్టవచ్చు. కాని రాత్రికి ఎలాగ!

ఏమైనా ఇక్కడ కూర్చుని యోచిస్తే ప్రయోజనం లేదనిపించింది. కాస్త అటు ఏకోమటింటికోపోయి విచారిస్తే ఏదో పరి ష్కారం దొరక్కపోదు. పిల్లలు చెప్పింది ఎంతవరకు నిజమో కూడా తెలుసుకోవచ్చు. కాస్త వూరు చూచినట్లుకూడా వుంటుంది.

కుర్చీలోంచి లేచి నిలబడ్డాను. ఎదురుగా ఆమె!

'పదండి మాష్టారూ...' అంది సుగుణ.

స్కూలుకు తాళం బిగించి ఇరువురమూ బయటపడ్డాము. ఆమెతో ఏమి మాట్లా డాలో ఎలా మాట్లాడాలో నాకేమీ తెలియని పరిస్థితి. ఉన్న పరిచయం అతిస్వల్పం. కొద్ది నిమిషాలు మౌనంగా నడిచాము.

'మీకు నాలుగురోజులు క్రొత్తగా వుంటుంది మాష్టారూ' అంది సుగుణ.

'అవును' అన్నాను ముక్తసరిగా.

'ఇదే మాష్టారూ మా ఇల్లు' అంది ఒకపూరింటి తలుపుతీస్తూ.

'మరి నేను వస్తానండి ... మధ్యాహ్నం స్కూల్లో కలుద్దాము...' అంటూ రెండడు గులు వేశాను.

'ఉండండి మాష్టారూ...' అందామె. వెనుతిరిగి చూచాను ప్రశ్నార్థకంగా.

'రండి... [illegible] గాని...'

సభ్యతకోసం వెనుతిరిగాను పూరిల్లయినా వున్న కాస్త సామానూ చక్కగా అమర్చు కొంది సుగుణ. నులకమంచంవాల్చి దుప్పటి పరిచి కూర్చోమంది. ఇంటివాసాలకు వ్రేలాడ గట్టిన ఉయ్యాలమంచం గాలికి నెమ్మ దిగా కదులుతోంది. చూస్తుండగానే ప్రక్కింటినుంచి షుమారు సంవత్సరం వయస్సున్న బాబును తీసుకొచ్చి—'మాబాబు మాస్టారూ' అంది నిద్రపోతున్న బాబును ఉయ్యాలమంచంలో పడుకోబెట్టింది.

'భోజనానికి లేవండి మాస్టారూ' అంది సుగుణ. నాకిది ఎదురుచూడని సమస్య.

'క్షమించండి' అన్నాను ఏమనాలో తెలి యక.

'క్షమించవలసింది మీరు. ఉదయం మీరు స్కూల్లో జాయినయినప్పుడే చెప్పి వుండవలసింది. నేనే మరచాను.'

'అదికాదండీ...'

'ఫరవాలేదు మాష్టారూ... ఇంత చిన్న విషయాన్ని మరీ అంతపెద్ద సమస్య చేయ కూడదు...లేవండిమరి...'

ఆమె మాటలు నన్ను నిరుత్తరుణ్ణి చేసాయి. ఆమె ప్రవర్తనలో, ఆలోచనలో సంభాషణలో ఏదో ప్రత్యేకతవుంది. ఏదో ప్రగతిభావం నివురుగప్పిన నిప్పులా ద్యోతక మవుతోంది. మంత్రముగ్ధుడిలా లేచి నిల బడ్డాను.

భోజనం ముగించిన నాకు టవల్ అందించి తను భోంచేసేందుకు ఆమె వంటగదిలోకి వెళ్ళింది. మంచంమీద నడుం వాల్చి ఆలోచనలో పడ్డాను. త్వరగా ఏదో చిన్న ఇల్లు చూచుకొని అమ్మను తీసుకు రావాలి. అంతవరకు పేయింగ్‌గెస్ట్‌గా ఎక్కడైనా భోజనానికి ఏర్పాటు చేసుకో వాలి. సాయంత్రం స్కూలు వదలగానే ముందావిషయం చూడాలి.

ఉయ్యాలలోని బాబు లేచినట్లున్నాడు. ఏడుపు ప్రారంభించాడు. లేచి నెమ్మదిగా వూపాను. అయినా ఏడుస్తూనే వున్నాడు. ఉయ్యాలఆపి బాబునుతీసి ఎత్తుకున్నాను— ఆరోగ్యంగా బాగానేవున్నాడు. ఏడ్పుమాని నాముఖంలోకి చూస్తున్నాడు. పాలబుగ్గలు నిమిరి ముద్దాడాను. బోసినోరువిప్పి నవ్వ టం ప్రారంభించాడు. అది కేవలం నవ్వు

కాదు. సమ్మోహనాస్త్రం!

'క్షమించాలి మాష్టారూ...మీకు పని కల్పించాను.' అంటూ ఆమె వంటగదిలోంచి బయటపడింది.

'ఫరవాలేదండీ—అమాత్రందానికి శ్రమనుకుంటే, అర్ధాంతరంగా భోజనానికివచ్చి మీకు నేనిచ్చిన శ్రమనేమనాలి'

'అర్ధాంతరంగా ఏమీరాలేదు మాష్టారూ చెప్పేవచ్చారు' అంది ఆమె సన్నగానవ్వుతూ.

'అంటే!'

'అంటే ఏముంది...ఈరోజు మీరువచ్చి జాయినవుతున్నట్లు హెడ్ మాస్టారుకి వ్రాశారుగా.'

'వ్రాస్తే...!'

'ఎందుకైనా మంచిదని మరో మనిషికి ఎక్కువ వంటచేసాను. అనుకున్నట్లు మీరు రాకుంటే రాత్రికి నేను కాస్త చల్లటి అన్నం తినాలి. అంతేగా!'

ఆమె చెబుతూంటె వినటమే నా వంతయింది.

'ఈ వూరు సంగతి నాకు తెలుసు మాష్టారూ. బంధువులైతే భోజనం సమస్య లేదనుకోండి. పై అధికారులొచ్చినా ఫరవాలేదు. పంచాయతీబోర్డు ప్రసిడెంటో, మునసబో, లేకుంటే మరో పెద్దరైతో వాళ్లను బాగానే మేపుతారు. ఎటొచ్చీ మనలాంటి వారు వచ్చినపుడే వస్తుంది చిక్కంతాను.' బాబుకు సీసాతో పాలు పట్టిస్తూ ఆమె చెప్పుకుపోతుంది.

# సుగుణ

'మీరొచ్చి ఎంతకాలమైందీ వూరు...'

'ఇంకా సంవత్సరం నిండలేదు మాష్టారూ. మొదట్లో నేనూ బాధపడ్డాను. వచ్చిన రోజున భోజనం లేకుండానే గడిపాను. తరువాత ... తరువాత రోజులు బాగానే గడుస్తున్నాయనుకోండి...ఏమైనా మనపెద్దలు కథలు చెప్పే పూర్వకాలపు పల్లెటూళ్లు కావివి.'

బాబుకు పాలివ్వటం పూర్తిచేసి ప్రక్కింట్లో ఇచ్చి వచ్చింది సుగుణ ఇంటికి తాళం వేసి స్కూలుకు బయలుదేరాము ఇద్దరమూ. ఏవో స్కూలు కబుర్లు దొర్లాయి మాటల్లో.

* * *

అలా ప్రారంభమైన మా పరిచయం తరువాత తరువాత చాలా ఆత్మీయుల్ని చేసింది. స్వంత విషయాలు మినహాయించి అన్ని విషయాలూ మాట్లాడుకొనే వాళ్లం. స్వంత విషయాల ప్రసక్తి వస్తే మాత్రం చాకచక్యంగా ఆ ప్రసక్తి మార్చివేసేది. అది గమనించి నేను కూడా ఆ ప్రస్తావన తెచ్చేవాడిని కాదు.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆమెను గురించి అనేక సందేహాలు కలిగాయి నాకు. నేనా గ్రామం వెళ్లి ఆరునెలలైనా ఆమె భర్తనెప్పుడూ చూడలేదు. ఆయనసలు ఎక్కడుంటారో, ఏమిచేస్తారో ఎవరికీ తెలియదు. ఆమె ఆ గ్రామం వచ్చిన తరువాత బంధువులెవరూ ఆమెను చూచేందుకు రాలేదని చెప్పారు కొందరు. ఊళ్లోవాళ్లు ఆమెను గురించి రకరకాల ఊహాగానాలు ప్రారంభించారు. ఆమె భర్త చనిపోయాడని కొందరూ, కాదు వదిలేశాడని కొందరూ, గుసగుసలు ప్రారంభిస్తే మరికొందరు కొంత ముందుకు పోయి అసలామెకు పెండ్లేకాలేదని ఎవరి ద్వారానో అక్రమ సంతానం కలిగిందని పుకారు లేవదీశారు. కాని అసలు నిజమేమిటో నిర్ధారణగా ఎవరికీ తెలియదు.


సుగుణ మెడలో మంగళసూత్రం లాంటిదేమీ వున్నట్లు నాకెప్పుడూ కన్పించలేదు. మామూలు వాయిల్ చీరలు కట్టేది. ముఖాన బొట్టు పెట్టటం నేనెప్పుడూ చూడలేదు. మరి ఆమె నాకు చూపించిన బాబెవరు? ఆమెకు నా — అన్నవాళ్లెవరూ లేరా? వుంటే చూచేందుకెందుకు రారు? కనీసం తనైనా శలవల్లోనైనా ఎందుకు వెళ్లదు?

నేనా వూళ్లో వున్న మూడేళ్లలోనూ నాకా ప్రశ్నలకు సమాధానం దొరకనే లేదు. అనేక పర్యాయాలు నాలుక చివరివరకూ వచ్చింది కాని అడుగలేక పోయాను. అడిగినా చెబుతుందనే నమ్మకం కూడా నాకు లేదు.

అప్పుడు నాకు పాతికేళ్లు. ఆమెకు ముప్పయి దాటి వుంటాయి. 'త్వరగా పెళ్లి చేసుకొని మీ అమ్మకు శ్రమ తప్పించండి మాష్టారూ—' అంటుండేది తరుచుగా. 'పల్లెటూరి బడిపంతుళ్లను చేసుకొనే అమ్మాయిలుండొద్దుటండీ—' అంటుండేవాడిని నేను. తరువాత సంభాషణ మరోవైపుకు సాగేది.

'సుగుణ ఇంటిదగ్గరున్నంత సేపూ కనీసం పదిమంది పిల్లలన్నా ఎప్పుడూ ఆమె చుట్టూతా వుండేవాళ్లు. రాత్రుళ్లు కూడా నలుగురైదుగురు పిల్లలు ఆమె ఇంటివద్దనే పడుకొనేవారు. వాళ్లందరికీ ట్యూషన్లు చెప్పేది. కాని ఎవరిదగ్గరగా పైసకూడా పుచ్చుకొనేదికాదు. ఒకసారి మాటవరుసకు అన్నాన్నేను—

'మీరు మరీ ఇంత మంచివారైతే ఎలాగండీ...ట్యూషన్లు చెప్పినపుడు వాళ్ల సంతోషంతో ఇచ్చిన ధనమో ఫలమో తీసుకుంటె తప్పేముంది.'



## సుగుణ

'తప్పని వెనుకొప్పటంలేదు మాష్టారూ. నిజానికి డబ్బుతో బాగా అవసరం కలిగిన రోజుల్లో రాత్రింబవళ్లూ ట్యూషన్లు చెప్పి గోళ్లూడగొట్టి మరీ వసూలు చేసేవాన్ని...'

'అంటే ఇప్పుడు మీకు డబ్బు అవసరం లేదన్నమాట!'

'అంత ఆశ్చర్య పడాలిసిందేముంది మాష్టారూ... అదినిజమే. నేనొక్కదాన్ని. బాబింకా చిన్నవాడు. మా ఇద్దరికి ఎంత కావాలి! నాకొచ్చే జీతంలో ఇంకా కాస్తో కూస్తో మిగుల్తోంటే సేవింగ్స్ బాంక్‌లో పడేస్తున్నాను కూడాను.'

నా ఆశ్చర్యం ద్విగుణీ కృతమైంది.

'మీబాబు భవిష్యత్తు కోసరమైనా మీరు సంపాదించ వచ్చునుగదా.'

'నా భవిష్యత్తును గురించిన ఆలోచనే నాకింతమట్టుకు లేదు మాష్టారూ...! బాబు భవిష్యత్తును గురించి ఏమి ఆలోచించ మంటారు!!' అంది చిన్నగా నవ్వుతూ.

'జీవితాన్ని గురించి మీరంత నిర్లిప్తత ఎందుకు అలవరచుకున్నారు?'

'నా దృష్టిలో జీవితం ఇంద్రధనుస్సు లాంటిది మాష్టారూ! ఇంద్రధనుస్సు యదార్థమా కాదా అని ప్రశ్నిస్తే మీరేమి సమాధానం చెబుతారు? మీరు చెప్పే ఏ సమాధానాన్నీ కాదనేందుకు లేదు!! కంటితో చూస్తున్నాము గనుక మనం ఇంద్రధనుస్సు యదార్థ మంటున్నాము! కాని శాస్త్రజ్ఞుడు అక్కడేమీ లేదంటున్నాడు!! అతని కంటికీ అది కన్పిస్తోంది, కాని మేధస్సు కాదని ఋజువుచేస్తోంది...'

నేను అలాగే ఆమె ముఖంలోకి చూస్తూ వింటున్నాను. ఎందుకింత గర్భితంగా మాట్లాడుతోందీమె!

'మనం త్రికాలాలనుగురించీ యోచిస్తూ కూర్చుంటే లాభంలేదు మాష్టారూ... మానవులమన్న విషయాన్నీ కర్తవ్యాన్నీ మరువకుండా వుంటేచాలు. అంతకుమించి మనం చెయ్యవలసిందిగాని చెయ్యగలిగింది గాని ఏమీలేదు!'

ఎవరో ఆగంతకుడు రావటంతో ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

'రా మధూ...రా...' అంటూ ఆహ్వానించిం దతన్ని. షుమారు పదహారు పదిహేడు సంవత్సరాలుంటాయి. నిక్కరూ సగంచేతుల చొక్కా వేసుకున్నాడు. నన్ను చూచి లోపలి కొచ్చేందుకు కాస్త తటపటాయించాడు.

'ఫరవాలేదు...రా మధూ ... ఈ రోజు భోజనానికేమైనా ఇబ్బంది కలిగిందా...' అందామె.

'లేదండి...'

'మరి!...చెప్పు మధూ...ఫరవాలేదు'

'పరీక్ష ఫీజుకు ఇంతమట్టుకు డబ్బు దొరకలేదండీ...డేటేమో దగ్గర పడుతోంది. నాకేమో భయంగావుంది; అసలు నేను పరీక్ష కెళ్లగలనో లేదోనని...'

ఆమె క్షణకాలం యోచించింది.

'రేపు సాయంత్రం నన్నొకసారి కలుసు మధూ...నువ్వేమీ భయపడబోకు—నేను సర్దుతానులే. బాగా చదువుకో.'

'అలాగేనండీ...' అంటూ అతను వెళ్లిపోయాడు.

'ఇతనిపేరు మధుసూదనరావుమాష్టారు.. అంతా మధూ అంటారు. ఇదే అతని పుట్టినవూరు. కాని భుక్తిగడవక తండ్రి మిగతా పిల్లల్నీ, భార్యనీ తీసుకొని వేరే చోటికి వలసవెళ్లారు. ఇతనిక్కడేవుండి వారాలు తింటూ ప్రక్కవూళ్లోవున్న హైస్కూల్లో స్కూలు ఫైనల్ క్లాసు చదువుతున్నాడు. క్లాసులో అన్నిట్లోనూ ఫస్టుమార్కు లితనివే...'

'అలాగా...'

'అప్పుడప్పుడూ కొన్నిళ్లవాళ్లు ఏవో ఇబ్బందులుచెప్పి, ఆరోజుకు భోజనం మరెక్కడయినా చూచుకోమంటారు! అప్పటికప్పుడు ఎక్కడ చూచుకొంటాడు చెప్పండి! అంచేత మధ్యమధ్య పస్తులలానే స్కూలుకు వెళ్ళడం అలవరచుకొన్నాడు. మనయింటికూడా వారానికోరోజు భోజనానికొస్తాడు. వేరేచోట వీలుపడనప్పుడల్లావచ్చి భోంచేస్తూ వుండమని చాలా సార్లు చెప్పాను. కాని పస్తైనా వుంటాడుకాని రాడు. అంతటి అభిమానస్తుడు! ఎంతో తప్పనిసరి కాబట్టి ఈరోజు డబ్బుకొరకొచ్చాడు...'


ఆ తరువాత మేము చదువుకొన్నప్పటి అనుభవాలమీదికి పోయింది సంభాషణ.

*  *  *

ఊళ్లో అందరికీ సుగుణ అంటే చాలా అభిమానం. ఎవరింట్లో ఏ అపదవచ్చినా ముందునిలబడేది సుగుణ. ఎవరింట్లో శుభకార్యం జరిగినా అన్నింటా తానై ఊపిరి సలుపని పనుల్లో లీనమయ్యేది సుగుణ!

నా పెండ్లి సందర్భంలో సుగుణ నిర్వహించిన పాత్రను నేనెప్పటికీ మరువలేను. ప్రతిపనీ ఎంతో బాధ్యతతో నైపుణ్యంతో నిర్వహించింది సుగుణ. అందుకే మా అమ్మకు సుగుణంటే తన కూతురుకన్నా మిన్న.

ఒకరోజు అర్ధరాత్రి సమయంలో మా తలుపు ఎవరో దబదబా బాదుతున్నారు.



'నిద్రమత్తుతో నేను వెంటనే లేవలేక పోయాను నా భార్య జయ తట్టిలేపింది. కళ్ళు నులుముకుంటూవెళ్ళి తలుపు తీశాను. ఎదురుగుండా నాలుగోక్లాసు కుర్రాడు మోహన్ వున్నాడు. నన్ను చూచి 'మీరు త్వరగా రావాలి మాష్టారు' అని గిరుక్కున వెనుతిరిగాడు.

జయ అందించిన షర్టు తగిలించుకొని గుండీలు పెట్టుకుంటూనే హడావుడిగా బయటకు నడచాను. ఆ కుర్రాడు అప్పటికే వెళ్ళిపోయాడు.

మా ఇంటికి అరఫర్లాంగు దూరంలోనే వుంది సుగుణ వుంటున్న ఇల్లు. ఆమె ఇంట్లో చదుపుకొని రాత్రుళ్ళు అక్కడే పడుకొనే నలుగురైదుగురు పిల్లల్లోనూ మోహన్ ఒకడు. అందుకే అతనెక్కడినుంచి వచ్చిందీ వూహించి సరాసరి సుగుణ ఇంటికే వెళ్ళాను. తలుపులు దగ్గరకువేసి వున్నాయి. తలుపు సందుల్లోంచి గుడ్డివెలుగు బయటి కొస్తోంది.

ఒకక్షణమాగాను. ఆ చీకటిలో తలుపు ప్రక్కగా నిలబడి నాకొరకు ఎదురు చూస్తున్నాడు మోహన్. ఇరువురమూ క్షణకాలం అలాగే నిలబడిపోయాం. లోపలి నుంచి ఏవోమాటలు విన్పిస్తున్నాయి. చెవులు రిక్కించాను.

'నువ్వింత పతివ్రతవైతే ఈపిల్లా డెక్కడినుంచి వచ్చాడు...'

'క్షమించండి బాలకృష్ణగారూ ... ఆ విషయం మీకు చెప్పవలసిన అవసరం నాకు లేదు. నేను పతివ్రతనని మీముందు నిరూపించుకోవలసిన అవసరం అంతకన్నాలేదు. మొన్న మీ ఇంటిదగ్గర మీతో కాస్త చనువుగా మాట్లాడానంటే అది కేవలం సోదర భావంతోనేనని మీరు గ్రహించలేకపోవటం నా దురదృష్టం. మీలో మరేలాంటి భావమైనా నేను తెలిసో తెలియకో కలిగించి వుంటే అందుకు క్షమాపణ కోరుకుంటు న్నాను...'

'మగాణ్ణి రెచ్చగొట్టి ఆనక క్షమాపణ కోరుకుంటే సరిపోతుందా...?'

'మీకు ఎలాచెబితే అర్థమవుతుందో నాకు తెలియకుండా వుంది. మీ దృష్టిలో రెచ్చగొట్టటమంటే ఏమిటో నాకర్థం కావటంలేదు. నిజానికలాంటి దేమైనాజరిగి వుంటే క్షమాపణ ముందేకోరాను. మీరు చదువుకున్నవారూ - సంస్కారులూ - అని భావించి చనువుగా మాట్లాడటంతో నేను పెద్దతప్పే చేశాను. కాని విజ్ఞులైనవారు చేసినతప్పు దిద్దుకోవాలి. కాని తప్పు చేశామే—అని బాధపడటమూ, లేక ఆతప్పు కప్పుకొవేందుకు మరొకతప్పు చేయటమో మనబోటివారు చేయవలసిన పనికాదు!...'

ఆమె గొంతులో ఒకవిధమైన ఉద్రేక భావమూ నిర్లక్ష్యమూ ప్రస్ఫుటంగా విన వచ్చాయి.

'నీపరువు బజారుకెక్కిస్తే ఏమి చేస్తావు'... బాలకృష్ణగొంతు.

'కేవలం ఒక్కవ్యక్తి మరోవ్యక్తి పరువును బజారులెక్కించ గలిగితే అది వ్యక్తిత్వంమీద నిర్మించుకున్న పరువుకాదని మాత్రం బుజువౌతుంది. నిజంగా వ్యక్తిత్వంగల మనిషిని ఎవరూ ఏమీచెయ్యలేరు. ఎవరైనా అలాంటి సాహసాని కొడిగట్టినా చివరికి తనవ్రేళ్ళతో తనకళ్ళే పొడుచుకో వలసిన పరిస్థితి కలుగుతుంది'

'నేను తలుచుకుంటే రెండోరోజునిన్ని వూరునుంచి బదిలీచేయించగలను తెలుసా...'

'ఫరవాలేదు బాలాకృష్ణగారూ నాకే వూరయినా ఒకటే! ఈవూరు వచ్చేటప్పుడు



ఆరోగ్య అనారోగ్య
పరిస్థితులలో మహిళలు
ఆరోగ్య
సౌభాగ్యములకు
ఆధారపడునది
లోధ్ర
66 సంవత్సరముల పైగా
ప్రసిద్ధినొందినది


కేసరి కుటీరం
(ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట. మద్రాసు-14
ఏజెంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ సికిందరాబాదు మధుర
బరహంపురం బెంగుళూరు

ఎలెక్ట్రిక్ & రేడియో
ఇంజనీరింగ్ కోర్సు
ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపేరింగ్, అసెంబ్లింగ్, ఎలెక్ట్రికల్ సూపర్ వైజరీ, వైరింగ్ వగైరాలకు సమగ్రమైన గైడ్ (800 బొమ్మలు గలది) రు 12-5). వి పి. పోస్టేజి రు 2.
SULEKHA BOOK DEPOT
(E) ALIGARH.

తెల్ల వెంట్రుకలుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. "Palitari" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్లవానిని నల్లవిగామార్చి, ఆటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపువృద్ధిపరచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభంలేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/-
Sri Krishna Chandra Vaidya
(APH) P O. Katrisarai (Gaya)

# సుగుణ

సంతోషించలేదు. రేపు వెళ్ళిపోయేందుకూడా దిగులులేదు...'

'ఇంతటి మూర్ఖత్వం నేనెక్కడా చూడలేదు...' అని గబగబా అడుగులేస్తూ వచ్చినదారే పట్టాడు బాలక్రిష్ణ. నేను, మోహన్ చీకట్లో ప్రక్కకు తప్పుకున్నాము. పంచాయితీబోర్డు ప్రెసిడెంటు బాలక్రిష్ణ వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు...

అలాంటిమనిషి సుగుణ!

ఆ సంఘటన తరువాత రెండు ఫలితాలను ఆశించాను నేను. మొదటిది సుగుణ మానసికంగా క్రుశిస్తుందని, రెండవది సుగుణకు బదిలీ ఖాయమని. కాని నా అంచలు పూర్తిగా తలక్రిందు లయ్యాయి. ఆమెలో నాకెలాంటి మార్పూ కన్పించలేదు ఆశించినట్లు బదిలీకాలేదు!

మరో సంవత్సరం తిరక్కుండానే నాకు వేరేవూరు బదిలీఅయ్యింది. ఆసందర్భంలో బాలకృష్ణ ఆమెను బదిలీచేస్తానని బెదరించిన ప్రసక్తి జ్ఞప్తికివచ్చింది. నిజానికి అతను తలుచుకుంటే అదేమంత కష్టమైన పనేమీకాదు మరెందు కుపేక్షించినట్లు!

నా సందేహం విని సుగుణ తేలిగ్గా నవ్వేసింది. మనిషి ఎన్నటికీ మనిషే మాష్టారూ క్రోధంలో మానవత్వం మరుగునపడినా ఎల్లవేళలా అది అలాగే వుంటుందను కోవటం పొరపాటు బాలకృష్ణ సంస్కారంమీద అప్పుడేకాదు ఇప్పుడుకూడా నాకు నమ్మకం వుంది. అందుకే అతనితో ఆసమయంలో అంతసేపు వాదించగలిగాను మరొవ్యక్తయితే నేనాలాంటి అవకాశాన్ని కల్పించేదాన్నేకాదు పిల్లల్నిలేపి అల్లరి చేయించేదాన్ని—'అంది సుగుణ.

నేనావూరునుంచి వచ్చేస్తుంటే సుగుణ అంది—

'మాష్టారూ మూడేళ్ళ ఒకచోట పని చేశాము కాని ముప్ఫయి సంవత్సరాల అనుబంధాన్ని పెంచుకున్నాము. దానికేమీ రూపంలేదు. మన అనుబంధం హృదయగతమైంది. అందుచేత మనమిరువురమూ జీవించినంతకాలమూ అది మాసిపోకూడదని నా వాంఛ...'

నేను అంగీకార సూచకంగా తల వూపాను.

'కొంతమంది జీవితాలు చాలా విచిత్రంగా వుంటాయి మాష్టారూ—వాళ్ళెందుకు జీవిస్తారో వాళ్ళకే తెలియదు. వాళ్ళ కోరిక లేమిటో వాళ్ళకు తెలియవు. తెలిసినా వాటిని అనుభవంలోకి తెచ్చుకోవటం ఎలాగో తెలియదు కనుక హృదయాంతరాళాల్లో అణచి వేస్తారు...'

ఏహో అడగాలనుకున్నాను. కాని అడగలేక పోయాను.

ఆమెకు నమస్కరించాలనిపించేది. అనేకసార్లు ఆ పని మనస్సులోనే చేశాను. ఆమె వయస్సులోనూ, అనుభవంలోనూ అన్నింటా నాకన్నా పెద్దే. ఆమె నుంచి నేర్చుకోవలసింది చాలా వుందనుకునేవాడిని. కాని నిజంగా నేర్చుకున్నది మాత్రం చాలా స్వల్పం!

* * *

కండక్టరు కేకతో ఈ లోకంలో పడ్డాను. అప్పటికే బస్సు గమ్యస్థానం చేరుకొంది. చేతి సంచితో సహా బయట పడ్డాను. రోడ్డుకు రెండు ఫర్లాంగుల దూరంలో వుంటుంది వూరు. నెమ్మదిగా అడుగులు పడుతున్నాయి

ఆరేళ్ల తరువాత మళ్లా ఆ వూరెళుతున్నాను, ఆ వూరు నించి బదిలీ అయిన తరువాత నేను మరో రెండూళ్ళు చూచాను ఆమెకు మాత్రం అప్పటి నుంచీ బదిలీకానేలేదు. ఆమె ఎన్నడూ బదిల కావాలనీ, వద్దనీ అడగలేదు.

అప్పుడపుడూ పుత్తరాలు రాస్తూండేది. తిరిగి నేను సమాధానం వ్రాస్తూవుండేవాడిని, ఒకసారి మాత్రం ఎన్నో వుత్తరాలు రాయగా వేసవి శెలవుల్లో వచ్చి పది రోజులుంది మా యింటి దగ్గర ఆ పది రోజులూ పదిక్షణాల్లా గడిచిపోయాయి. నా భార్యకూడా ఆమెఅంటె ఎనలేని గౌరవ భావం.

ఆమె పైకెంత ప్రశాంతంగా కన్పించినా గుండెల్లో అగ్నిపర్వతం వుంది! ఆ నవ్వుని చిరునవ్వు వెనుక ఏవో అభావాలు దాగి వున్నాయి!

'నమస్కారం మాష్టారూ—' అన్నాడు ఎదురుగా వస్తున్న వ్యక్తి.

ప్రతినమస్కారం చేసి అతని వైపు పరిశీలనగా చూచాను. అతనెవరో కాదు — మోహన్! బాలకృష్ణ సంఘటనలో అర్ధరాత్రి మా యింటికి వచ్చి తలుపు తట్టిన మోహన్. మనిషి బాగా సాగాడు

'బాగున్నావా మోహన్...' అన్నాను.

'ఆ...' అన్నాడు ముక్తసరిగా.

'ఏ క్లాసు చదువుతున్నావు మోహన్...'

'ఫిఫ్త్‌ఫారంలోకొచ్చాను మాష్టారూ...'

'ఈ రోజు స్కూలు కెళ్ళలేదా—'

'మాష్టారూ...' అన్నాడు మోహన్ గద్గదస్వరంతో.

తల పైకెత్తి అతని ముఖంలోకి చూచాను. అతని కళ్ళ నుండి ధారగా కారుతున్నాయి నీళ్ళు. నాకంతా అయోమయంగా వుంది.

'మాష్టారూ మీకింకా తెలియదా...!' అన్నాడతను.

'నీవంటున్నది దేన్ని గురించి మోహన్?'

'సుగుణమ్మ టీచర్ మనకిక లేరు మాష్టారూ...'

అతని దుఃఖం ఎక్కువైంది. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. నా పరిస్థితికూడా అంతకు తక్కువేమీ లేదు దుఃఖంతో పూడుకుపోయిన గొంతులోంచి మాటలు రాలేదు కళ్ళు ధారాపాతంగా వర్షిస్తుంటే పై పంచలో అద్దుకున్నాను. అడుగు ముందుకు పడలేదు. ఇద్దరమూ అలాగే నిలుచుండి పోయాము కొద్ది క్షణాలు.

'పదండి మాష్టారూ—అక్కడ ఏర్పాట్లన్నీ చేస్తున్నారు. అది చూడలేకే నేనిలా పారిపోయి వచ్చాను...'

మారుపలుక్కుండా ముందుకు చూచాను హృదయాన్ని పిండేసేంత బాధ. జీవంలేని సుగుణను నేను చూడబోయేది!

మోహన్ చెప్పినట్లే అంతా సిద్ధమయింది. మరికొన్ని క్షణాలు ఆలస్యమయితే ఆమె ఆఖరుదర్శనం కూడా దొరికేదికాదు నాకు. చూచాను మనస్సులోనే అంజలులు ఘటించాను సెలవు తీసుకోకుండానే వెళ్ళిపోయిన నేస్తాన్ని తలుచుకుంటే కడుపు చెరువే అయింది. కళ్ళు వర్షిస్తుంటే, ఆ కన్నీటి ధారల వెనుకనుంచి ఆ లేయెండలో సుగుణ ఇంద్రధనుస్సులోని సప్త వర్ణాలనూ పులుముకొని మెరుస్తోన్నట్లు కనబడుతోంది. ఆమె ముఖంలోని చెక్కుచెదరని ప్రసన్నత నన్ను ఓదార్చేందుకు ప్రయత్నిస్తోంది!

ఆమె అంతిమయాత్ర ప్రారంభమయింది. వూరు వూరే ఆమెవెంట కదిలింది వందలకొద్దీ నేత్రాలు వర్షిస్తున్నాయి. గ్రామమంతా బాధగా నిట్టూర్చింది. పదేళ్ళుగా ఆ వూళ్ళో వుంటోంది సుగుణ. అందరి అభిమానాలూ మూటగట్టుకొని మౌనంగా వెళ్ళిపోతోంది రోజా.

ఎక్కడ పుట్టిందో తెలియదు. ఎక్కడ పెరిగిందో తెలియదు ఏ తల్లి కన్నదో తెలియదు. ఎవరూ దగ్గరలేరు. కాని ఆమె కేలోటూ జరుగలేదు ఆమెకంతా ఆత్మీయులే!

* * *

బస్సు పరుగెడుతోంది. నా మనస్సు అంతకన్నా వేగంగా పరుగెడుతోంది. నా ప్రక్కసీట్లో కూర్చున్న పదేళ్ళ బాబు బస్సు కిటికీలోంచి ఎటో చూస్తున్నాడు బహుశా కన్పించని తల్లికోసమే అంతగా వెతుకుతున్నాడేమో!

బాబును నా కప్పగించి పోయింది సుగుణ. సంతానంలేని మాకు వరమిచ్చి మాయమైన దేవత సుగుణ.

సుగుణ ఎవరో తెలిసిపోయింది! నాకంతా చెప్పే వెళ్ళింది సుగుణ నేనెప్పుడో అనుకున్నాను—సుగుణ ఏనాటికైనా తన సంగతి నాకు చెబుతుందని. అది నిజమే అయింది

జేబు తడుముకొంటే చేతికి తగిలింది కాగితపు మడత. పైకితీసి మడత విప్పాను. ఇప్పటికది వందోసారి. ఇంకా ఎన్ని సార్లో ఏమో కూడా...

'మాష్టారూ'

ఈ వుత్తరం నేను చనిపోయిన తరువాత మీ కందాలనే వుద్దేశ్యంతో వ్రాస్తున్నాను మీకు చెప్పవలసింది చాలావుంది అంతా చెబుదామనే వుంది. కాని రాసే ఓపిక లేదు అందుకే టూకీగా చెబుతాను. దీంట్లో ఖాళీలేమైనా వుంటే మీరే పూరించుకోండి.

అందరిలాగానే నన్నుగురించి మీకు చాలా సందేహాలున్నాయి ఆ సంగతి నాకూ తెలుసు కాని మీకేమీ చెప్పలేదు అప్పట్లో అలాంటి అవసరం కన్పించలేదు. ఇప్పుడిహ తప్పదు. అందుకే రాస్తున్నాను.

ఇప్పుడైనా ఎందుకు చెబుతున్నానో తెలుసా మాష్టారూ! నా బాబును మీ చేతుల్లో పెడుతున్నాను. అన్నీ ఆలోచించుకొనే, గత్యంతరంలేకనే నీపని చేస్తున్నాను అందుకు ముందుగా మీరు నన్ను క్షమించాలి.

మరచాను మాష్టారూ... సేవింగ్స్ బ్యాంక్‌లో బాబుపేర నాలుగువేల వరకు రొక్కంవుంది మేజరయిన తరువాత వాడికది లభిస్తుంది.

వాడిని మీచేతుల్లో పెడుతున్నాను గనుక వాడెవరో ముందు మీకు తెలియాలి. అది తెలిపేందుకు నాకథ మీకు టూకీగానైనా చెప్పాలి.

మాది చాలా బీదకుటుంబం మాష్టారూ.. నాకు పదేళ్లప్పుడే అమ్మ పోయింది. నాకింకా పూర్తిగా లోకజ్ఞానం తెలియకుండానే నాన్న పోయారు. నాకు ఒక తమ్ముడు మరో చెల్లెలు వున్నారు. వాళ్ళిరువురినీ నాచేతిలోపెట్టి తను అమ్మను చేరబోయారు నాన్న.

నేను పడ్డపాట్లన్నీ ఇప్పుడు చెప్పుకుంటే తీరవిప్పుడు. అంత ఓపికాలేదు నాకిప్పుడు.

కష్టపడి ఎలాగో హయ్యర్ గ్రేడ్ ట్రెయినింగ్ పూర్తిచేసి పంతులమ్మనయ్యాను. రాత్రింపగళ్ళు ట్యూషన్లు చెప్పి తమ్ముణ్ణి చెల్లెల్ని పెద్దవాళ్ళను చేసాను. తమ్ముడు బాగా చదువుకున్నాడు. డిగ్రీ సంపాయించాడు మంచి ఉద్యోగంకూడా వచ్చింది. ఆవార్త చెప్పేందుకు ఎంతో ఆనందంతో వచ్చాడు నేనున్న వూరికి కాని మాష్టారూ ఈలోగా విధి నన్నుచూచి వెక్కిరించింది! నా చెల్లెలు కాలుజారి గర్భవతి అయింది!! భ్రూణహత్య చేసేందుకు నామనస్సంగీకరించలేదు. ఆమె మగశిశువును కన్నది. ఆ శిశువుకు అప్పుడు మూడునెలలు. వాడితమ్ముడు ఎవరని ప్రశ్నించాడు! ఏమని చెప్పను మాష్టారూ అబద్ధం చెప్పడం మరి! నిజం చెప్పాలి అందుకే చెప్పాను ఎవరు కాకుండా నాబాబే అన్నాను! తమ్ముడిముఖం వివర్ణమయింది. మళ్ళా నన్నేమీ ప్రశ్నించలేదు చెల్లెల్ని తీసుకొని ఆరోజే వెళ్ళిపోయాడు వెళ్తూవెళ్తూ చెప్పాడు—నిన్ను మరచిపొమ్మని! నేను కూడా బదిలీ చేయించుకొని ఈవూరొచ్చాను

అంతే మాష్టారూ...తరువాత కథ మీకు తెలిసిందే

ఇంకేమి వ్రాసేది!

మీమీద చాలా భారముంచి వెళుతున్నాను అందుకు మన్నిస్తారు కదూ!—'

''సుగుణ''

ఆలోచనలనుంచి తేరుకొని బయటికి చూచాను చీకటి నెమ్మదిగా క్రమ్ముకొంటోంది. తారామండలంలో ఒకనక్షత్రం మినుకు మినుకు మంటోంది అందులోంచి సుగుణ నన్నుచూచి మందహాసం చేస్తోంది.

'నీవెంత ఉన్నతురాలవు సుగుణా'—అనుకొన్నాను మనస్సులో.